రోయ్ లే-అవుట్‌లో
40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్
40x40 ఫస్ట్ ఫ్లోర్
అద్దెకు ఇవ్వబడును
కాంటాక్ట్ నెంబర్లు 9441937973 9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.

SSC GD కానిస్టేబుల్స్ & RRB
శ్రీకాకుళంలో మొదటిసారి కార్పోరేట్ ప్రమాణాలతో..
ఫ్రీ మెగా సెమినార్
తేది: 27-10-2024 (ఆదివారం) ఉదయం 9 గం॥లకు
అర్థమెటిక్: చలం రవి గారు (25 Years Experience)
ఇంగ్లీష్: గుణశేఖర్ గారు (Senior Faculty)
రీజనింగ్: తులసి గారు, శంకర్ గారు
ప్యూర్ మేథ్స్: గురునాయుడు గారు
SOLVE ACADEMY Srikakulam
86881 72010
90300 28181

ICL COURIER
INTERNATIONAL COURIER & CARGO
విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు
పచ్చళ్లు, బట్టలు, పిండివంటలు, బుక్స్, స్వీట్స్, మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.
- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing
దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.
9989172822, 9505944472, 9248199493

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 26-10-2024
సంపుటి: 20 సంచిక: 182
పేజీలు: 4 వెల: రూ.1

# 'లైఫ్' తీసేశావ్ కదా బాసూ..!



బజారుబ్రాంచిలో కుంభకోణాన్ని మొదటిగా వెలికితీసిన ఈ ఏడాది ఏప్రిల్ నాటి 'సత్యం' కథనం.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నరసన్నపేట ఎస్‌బీఐ బజారు బ్రాంచిలో జరిగిన నకిలీ రుణాల కుంభకోణం గుట్టు దాదాపు వీడిపోయినట్టే. ఇందుకు పాత్రధారిగా వ్యవహరించిన అప్పటి బ్రాంచి మేనేజర్ శ్రీకర్‌ను బ్యాంకు అధికారులు ఉద్యోగం నుంచి పక్కన పెట్టారు. సస్పెన్షనా? టెర్మినేషనా? అనేది చెప్పకుండా ఈ కుంభకోణం బయటపడిన దగ్గర్నుంచి ఈరోజు వరకు ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. మరోవైపు గార బ్రాంచిలో జరిగిన తాకట్టు బంగారం కుంభకోణాన్ని పోలీసులు రీ ఇన్వెస్టిగేట్ చేస్తున్నందున ఇందులో సూత్రధారిగా భావిస్తున్న అప్పటి ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ టీఆర్ఎం రాజు మీద పోలీసులు తీసుకునే చర్యల మేరకు నరసన్నపేట బజారుబ్రాంచి నకిలీ రుణాల కేసులో కూడా పాత్ర ఉందని భావిస్తున్న రాజు కథ కొలిక్కి వచ్చాక శ్రీకర్‌ను ఇంటికి పంపిస్తారని భోగట్టా. అసలు ఈ బ్రాంచిలో జిల్లాలో ఎక్కడా లేనన్ని నకిలీ రుణాలు ఎందుకు ఇచ్చారన్నది తెలియాలంటే ముందుగా ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కోసం తెలుసుకోవాలి. అప్పటి రీజనల్ మేనేజర్ టీఆర్ఎం రాజు కళ్లలో ఆనందం చూడటం కోసం, ఆయన్ను కోటీశ్వరుడ్ని చేయడం కోసం బజారు బ్రాంచి మేనేజర్ శ్రీకర్ పడిన తపనలో భాగమే ఈ నకిలీ రుణాల బాగోతం. దేశంలో టాప్ టెన్ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్ చేసిన రీజియన్‌లో శ్రీకాకుళం రీజియన్ టీఆర్ఎం రాజు హయాంలో టాప్-5లో ఉండేది. ఇదేదో బ్యాంకు వరకు ఘనకార్యమేమో గానీ సరిగ్గా ఇదే అంశం ఇక్కడ ఎస్‌బీఐని బజారుపాలు చేసింది. ఎస్‌బీఐలో డిపాజిట్ చేయడానికి వచ్చినవారిని, రుణాలు కావాలంటూ దరఖాస్తు చేసుకున్నవారితోను ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించి, ఆ కమీషన్‌ను టీఆర్ఎం రాజు లక్షల్లో పొందేవారు. ఇందుకోసం తన రీజియన్ పరిధిలో ఉన్న ప్రతీ బ్రాంచి మేనేజర్‌కు టార్గెట్ ఇచ్చి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ బలవంతంగా కస్టమర్‌తో కట్టించే విధంగా చేసేవారు. ఇందులో నరసన్నపేట బజారుబ్రాంచ్‌కు మేనేజర్‌గా పని చేసిన శ్రీకర్ ముందువరుసలో ఉండేవారు. ప్రతీనెల అందరి కంటే ఎక్కువ ఎస్‌బీఐ లైఫ్‌లు కట్టించి ఆర్ఎం ప్రశంసలు అందుకునేవారు. ఇందులో వచ్చిన కమీషన్ నేరుగా ఆర్ఎంకు చేరేది. ఒక ఏడాదికి ఎస్‌బీఐ లైఫ్ ద్వారా వచ్చిన కమీషనే కనీసం రూ.50 లక్షలు టీఆర్ఎం రాజు ఖాతాలో జమై ఉంటుందని ఒక అంచనా. నరసన్నపేట బజారుబ్రాంచి మేనేజర్ శ్రీకర్ అడ్డగా రుణాలు ఇచ్చేసేవారు. అది కాకుండా బినామీ పేర్లతో కూడా లావాదేవీలు నడిపించారు. ఇవన్నీ అప్పటి ఆర్ఎం టీఆర్ఎం రాజుకు తెలుసు. అయితే లోన్‌గా వెళ్లిన ప్రతీ అకౌంట్ నుంచి ఎస్‌బీఐ లైఫ్ కట్టించడం వల్ల అర్హత లేనివారికి కూడా రుణాలు ఇవ్వాల్సి వచ్చేది. ఎవరైనా పెద్దమొత్తానికి ఎస్‌బీఐ లైఫ్ కడతామంటే గుడ్డిగా ఇక్కడ లోన్‌లు ఇవ్వడం ప్రారంభించారు. ఎస్‌బీఐ లైఫ్‌లో ఒక ట్రెడిషనల్ పాలసీ తీసుకుంటే లక్ష రూపాయల ప్రీమియంకు రూ.30వేల కమీషన్ వస్తుంది. ఇటువంటి సొమ్ముల కోసం ఇష్టారాజ్యంగా లోన్లు ఇచ్చి మంది సొమ్ముకు కన్నం వేశారు. గులాబ్‌జామ్ కొంటే గిన్నె ఫ్రీ అన్న చందంగా తమ వద్ద లోన్ కావాలంటే ఎస్‌బీఐ లైఫ్ కట్టాలన్న నిబంధనే ఇప్పుడు బజారుబ్రాంచిలో నకిలీ రుణాలకు దారితీసింది. ఇందులో తిలాపాపం తలా కొంత పంచుకున్నారు. టీఆర్ఎం రాజుకు రూ.30వేలు కమీషన్ వస్తే అందులో మేనేజర్‌కు రూ.5వేలు వేసేవారట. ఇలా బ్రాంచి మేనేజర్లే ఎస్‌బీఐ లైఫ్ ఏజెంట్లుగా అవతారమెత్తడంతో నకిలీ రుణాలు సృష్టించి, వాటి పేరుతో ఎస్‌బీఐ లైఫ్ కట్టించి దొరికిపోయారు. వాస్తవానికి ఇది ఎస్‌బీఐకి సంబంధించిన సెమీ ఆర్గనైజేషన్. ఇందులో పాలసీలు కట్టించడానికి ఏజెంట్లు ఉంటారు. కానీ బ్యాంకు ఉద్యోగులే ఇటువంటి పాలసీలు కట్టిస్తే వీరిని సర్టిఫైడ్ ఇన్సూరెన్స్ ఫెసిలిటేటర్స్ అంటారు. ఎప్పుడైతే పెద్ద ఎత్తున కమీషన్లు, స్టార్ హోటల్‌లో మందు, విందు చిందు వంటి ఏర్పాట్లు, టార్గెట్లు ఇచ్చారో అప్పుడే ఎస్‌బీఐ లాంటి బ్యాంకులు రాంగ్ ట్రాక్‌లోకి వెళ్లిపోయాయి. ఇప్పుడు బజారు బ్రాంచిలోని వ్యవహారాన్ని టీఆర్ఎం రాజు సరిగ్గా ఇలాగే వాడుకున్నారు. బిజినెస్ క్రాస్ సెల్లింగ్ పేరుతో ప్రతీ లోనుకు భారీ ఎత్తున పాలసీలు చేసి కమీషన్‌ను వైట్‌మనీగా సంపాదించడం మొదలుపెట్టారు. ఈ మాయలో పడి బజారు బ్రాంచి మేనేజర్ శ్రీకర్ సుమారు రూ.కోటి వరకు ఎస్‌బీఐ లైఫ్ ప్రీమియమ్‌లు కలెక్ట్ చేసి టీఆర్ఎం రాజుకు బహుమానంగా ఇచ్చారు. మరీ విచిత్రమేమిటంటే.. రాజు గారి పుట్టినరోజు ఉందని ఒక అకేషన్ చూపించి ప్రీమియమ్స్ కలెక్ట్ చేసిన ఘనత శ్రీకర్‌దే. అందుకే ఇక్కడ మూడు కోట్ల వరకు నకిలీ రుణాలు వెలుగుచూశాయి. ఇక కొవ్వాడలో అణు విద్యుత్ కేంద్రానికి, మూలపేటలో పోర్టుకు భూమిలిచ్చినవారికి సంబంధించిన పరిహారం ఎస్‌బీఐలో ప్రభుత్వం జమ చేసింది. వీరి వద్ద పెద్ద మొత్తం ఉందని తెలుసుకున్న అప్పటి ఆర్ఎం రాజు వీరందరితోనూ ఎస్‌బీఐ లైఫ్ కట్టించేసి కమీషన్ తన ఖాతాలో వేసుకున్నారు. వాస్తవానికి ఇది రైతుల వార్షిక ఆదాయం కాదు. భూమి పోవడం వల్ల వచ్చిన సొమ్ము. కానీ ఎస్‌బీఐ లైఫ్ కట్టకపోతే విత్‌డ్రా చేయడానికి అవకాశం లేదని భయపెట్టడంతో చాలామంది ఈ పాలసీలు - మిగతా 4లో

- కమీషన్ల కోసం సిబ్బందిపై ఒత్తిడి
- ఆర్ఎం కళ్లలో ఆనందమే శ్రీకర్ కొంపముంచింది
- కొద్ది రోజుల్లో బజారుబ్రాంచి పాత బీఎంకు ఊస్టింగ్
- కొలిక్కి వచ్చిన నకిలీ రుణాల కుంభకోణం


ఎస్‌బీఐ లైఫ్ ద్వారా వ్యాపారం చేసినవారికి స్టార్ హోటల్‌లో ఇస్తున్న పార్టీ (ఫైల్‌ఫోటో)



# కొత్తూరు ఆసుపత్రికి అనారోగ్యం!

- సెలైన్లు పెట్టుకునే స్టాండ్లూ కరువు
- 60 గ్రామాలకు ఒకటే ఆసుపత్రి

(సత్యంన్యూస్, కొత్తూరు)

పాతపట్నం నియోజకవర్గంలో అనేక గిరిజన గ్రామాల ప్రజలకు కొత్తూరు కమ్యూనిటీ హెల్త్‌సెంటరే పెద్దాసుపత్రి. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న ఈ ప్రాంతంలోని ఏకైక ఆసు పత్రికి కనీస సదుపాయాలు కూడా లేకపోవడంతో ఇక్కడకు వచ్చిన రోగులు మరింత అనారోగ్యంతో కునారిల్లుతున్నారు. కొత్తూరు, భామిని, సీతంపేట మండలంలో కొన్ని గ్రామాలను కలుపుకొంటే దాదాపు 60 ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడకు నిత్యం ఆరోగ్య సేవల కోసం వస్తుంటారు. అందుకే ఈ ఆసుపత్రిలో ఎప్పుడూ 200 పైబడి ఔట్ పేషెంట్లు ఉంటారు. 30 పడకల ఈ ఆసుపత్రిలో ఎప్పుడూ మంచాలు ఖాళీగా ఉండవు. రోజుకు 120 మందికి రక్తపరీక్షలు అవుతున్నాయంటే ఈ ఆసుపత్రికి రోగుల తాకిడి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో ఆమాత్రం ఖర్చు పెట్టగలిగే స్తోమత ఉన్నవారు కొత్తూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న 12 చిన్న చిన్న ఆసుపత్రులకు వెళ్తున్నారు. విచిత్రంగా వీటన్నింటినీ ఆర్ఎంపీలు, పీఎంపీలే నడుపుతున్నారు. కొత్తూరు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో క్వాలిఫైడ్ డాక్టర్లు ఉన్నా సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రుల వైపు చూస్తున్నారు. ఇక్కడ ఎవరైనా సెలైన్ ఎక్కించుకోవాలంటే దాన్ని ఎత్తులో పట్టుకొని నిలబడటానికి మరో మనిషి అవసరం. అలాగే ఆసుపత్రిలో చేరిన తర్వాత రోగులే టేబుల్ ఫ్యాన్లు తెచ్చుకోవాలి.

ఇక్కడ మొత్తం 56 మంది సిబ్బంది ఉన్నా కనీస వసతులు మాత్రం ఏ ప్రభుత్వాలూ కల్పించలేకపోతున్నాయి. జనరల్ సర్జన్, గైనిక్ సర్జన్, పిడియాట్రిక్ వంటి నాలుగు విభాగాలు ఇక్కడ చురుగ్గా పని చేస్తుండటంతో నిత్యం రోగులు కిటకిటలాడుతున్నారు. ఒకటే ఎక్స్‌రే ప్లాంట్ ఉండటం వల్ల ఎముకలు విరిగి ఆసుపత్రిలో చేరితే ఆ రిపోర్టు రావడానికి రెండు రోజులు పడుతుంది. ఈలోగా నొప్పిని భరించలేక రోగులు జిల్లా కేంద్రానికి పయనమవుతున్నారు.








# నిర్మాణాలు 373.. అనుమతులు కేవలం 12


- సొమ్ములు తీసుకో.. కళ్లు మూసుకో
- అక్రమాలను పట్టించుకోని సుడా
- కక్షసాధింపు చర్యలకైతే రెడీ
- పొందూరులో పుట్టగొడుగుల్లా అక్రమ కట్టడాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో అక్రమకట్టడాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సుడా అనుమతులు లేకుండా లే-అవుట్‌లు, నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఉడా నుంచి విడగొట్టి సుడాగా మార్పుచేసిన తర్వాత అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టే విషయంలో ఎటువంటి మార్పు లేదు. సుడా పరిధిలోకి పొందూరు మేజర్ పంచాయతీని 2021 డిసెంబర్ 20న తీసుకువచ్చారు. ఈ నాలుగేళ్లలో వందల సంఖ్యలో నిర్మాణాలు జరిగాయి. ఇందులో కేవలం 12 మంది మాత్రమే సుడా అనుమతి పొందారు. మరో 10 మందికి నోటీసులు ఇచ్చారు. ఇంకా 373 మంది అనధికారికంగా కమర్షియల్, రెసిడెన్సియల్ నిర్మాణాలు పూర్తిచేశారు. అనధికారికంగా నిర్మించిన భవంతులన్నింటికి విద్యుత్ శాఖ విద్యుత్ మీటర్లు మంజూరు చేసింది. అనధికారిక నిర్మాణాల్లో అత్యధికంగా కమర్షియల్ భవనాలే ఉండడం గమనార్హం. వైకాపా హయాంలో స్థానిక నాయకులు డబ్బులు తీసుకొని భవన నిర్మాణానికి సాయం చేశారు. సుడా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయకూడదని తెలిసినా పంచాయతీ అధికారిని మేనేజ్ చేశారు. వైకాపా నాయకులకు డబ్బులు ఇవ్వనివారితో పాటు, ప్రత్యర్థుల భవనాలను సుడా అనుమతులు లేవని కూల్చిన ఘటనలు ఉన్నాయి. పంచాయతీ అధికారులకు భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసినా, నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చేసిన కథ ఇది.

అప్పటికి సుడా పరిధిలో పొందూరు - మిగతా 4లో




IN THE HIGH COURT OF ANDHRA PRADESH :: AMARAVATHI

W.P. No. 747 of 2022

Between:

Anakapalli Sri Ramulu, S/o Late Devudu Akkayya, Age 51 years, Occ: ABN Reporter, R/o Etcherla Village & Mandal, Srikakulam District.

..Petitioner

AND

1. State of Andhra Pradesh, Rep. by its Principal Secretary to Government, Panchayat Raj & Rural Development, Secretariat, Velagapudi, Amaravati, Guntur District & Others

..Respondents

COUNTER AFFIDAVIT FILED ON BEHALF OF THE RESPONDENT No.7

I, J Anuradha, W/o. G Raghunadha Rao, aged 52 years, Occ: Panchayat Secretary, presently on medical leave (Ponduru Gram Panchayat), Ponduru Mandal, Srikakulam District, do hereby solemnly affirm and state on oath as follows:

1. I submit that I am the Panchayat Secretary of the 7th Respondent in the Writ Petition and as such I am well acquainted with the facts of the case. I have gone through the affidavit filed in support of the writ petition and denied all the allegations except those that are specifically admitted hereunder. The petitioner is put to strict proof of her contentions. Without adverting to each para of the affidavit it is submitted as follows:

2. It is submitted that the petitioner has filed the present writ petition alleging that the respondents 4 to 9 are demolishing the petitioners building constructed in an extent of 125.3 sq.yrds out of 5 cents situated in survey No.219-20 of Ponduru Village, with a further direction to the respondents 2 & 3 to initiate the disciplinary proceedings against the respondents 4-9 for their illegal and arbitrary action of demolishing his building by considering his representation Dt.20.12.2021.

3. It is submitted that the allegations made by the petitioner against me is absolutely false and baseless. Only with a view to cover up his illegal action of constructing the building without permission, made false allegations against me.

(J. ANURADHA)

• ఎడిటోరియల్

## నువ్వేమైపోతే మాకేం?

నీకు ఏమైతే మాకేంటి? నీవు ఎలా పోయినా మాకు ఫర్వాలేదు. నీ బెయిల్ రద్దయి మళ్లీ సంవత్సరాల తరబడి జైళ్లో మగ్గినా మాకు ఎలాంటి పట్టింపు ఉండదు. అరె మాకోసం జైలుకు కూడా వెళ్లలేవా? నీవేం కొడుకువి? నీవేం అన్నవి? ఒకసారి వెళ్లావుకదా. మళ్లీ వెళ్లు. అంతమాత్రానికే భయ పడతావా! నీ చుట్టూ నీ శత్రువులు మూగి కరాళ నృత్యం చేస్తూ నిన్ను నాశనం చేస్తే చేయనీ. వాళ్లతో కలిసి నాలుగు నృత్యాలు చేస్తాం. నీకు ఏమైనా ఫర్వాలేదు. నీ ఆస్తుల్లో సగం మాకు ఇప్పుడే ఈ క్షణమే ఇవ్వాలి. అది నాన్న అభిమతం. నీ ఆస్తుల్ని సగం నాకు ఇవ్వాలన్న నాన్న అభిమతం నెరవేరడం కోసం ఆయన ఇతర అభిమతాలను కట్టకట్టి కాల్చేసి బాబు అండో కో కాళ్ల చుట్టూ తిరుగుతున్నాం. అది కూడా నీకు అర్థం కాలేదా? ఏమైనా చేస్తాం. మేం కావాలనుకున్నవన్నీ మాకు కావాలి. నీవు ఏమైపోయినా ఫర్వాలేదు. గెలిచిన రోజునుంచీ ప్రజలకే తప్ప మాకంటూ పథకాలు లేకుండా చేశావ్. మాకంటూ పథకాలు లేకపోతే మేము ఏం కావాలి? అందుకే మొన్నటి ఎన్నికల్లో నీ ప్రత్యర్థుల చేతిలో ఒక పావుగా మారి మా చేతనైనంత సహకరించి నీవు మట్టి కరిచేలా చేశాం. నీ వ్యక్తిత్వాన్ని పలుచన చేశాం. ఎగతాళి చేశాం. కష్టాలు పడతావో, నష్టాలు భరిస్తావో నీ చావు నీవు చావు. కష్టాలు నీకేం కొత్తనా? నీ గురించి, నీపార్టీ గురించి, నిన్ను నమ్ముకున్న లక్షలాది కుటుంబాల గురించి, నీ ప్రజాదరణ పొందిన పథకాల గురించి, నీ వెంటున్న నేతల గురించి, కార్యకర్తల గురించి, నీ సంస్థల్లో పనిచేసే వేలాది మంది ఉద్యోగుల గురించి మాకు ఎలాంటి పట్టింపు లేదు. నీవు మేం చెప్పినట్టు నడుచుకోవాలి. దట్సాల్. లేకపోతే నీపై కేసులు పెట్టి జైలుకు పంపినోళ్లతో కలిసి మేం కూడా బురద చల్లడం కొనసాగిస్తూనే ఉంటాం. తుడుచుకో.. పొద్దున చల్లుతాం.. సాయంత్రం చల్లుతాం.. నిత్యం చల్లుతాం.. తుడుచుకో.. నీకు ఇంకో పని లేదు. నిన్ను ఇలాగే హింసిస్తాం. మాకు బాబు అండ్ కో అండ ఉంది. ఖబడ్దార్ జగన్. రాజశేఖరరెడ్డి బిడ్డగా ఆస్తిలోను, అధికారంలోను షర్మిలకు కూడా ఎంతోకొంత వాటా దక్కడం న్యాయం. అయితే ఇక్కడ షర్మిలకు న్యాయం జరగలేదంటారు వేమూరి రాధాకృష్ణ. వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డగా ఆమెకు రావాల్సిన ఆస్తి ఎంతోకొంత ఎందుకు.. ఎవరెన్ని తిరకాసులు పెట్టినా ఆమెకు హక్కుగా రావాల్సింది ఎలా అయినా ఎంత రావాలో అంతా వస్తుంది. కానీ జగన్ వ్యాపారంలో సంపాదించిన దానిలో ఎంత సొంత చెల్లెలైనా కానీ చట్టపరంగా అయితే ఆమెకు వాటా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎన్టీ రామారావు పేరు మీద చెన్నై బజుల్లా రోడ్డులో కోట్ల రూపాయలు విలువ చేసే భూమిలో 8వేల చదరపు అడుగుల బంగ్లా ఉంది. ఆ బంగ్లాను ఎవరూ పట్టించుకోకుండా అలా వదిలేయడంతో పాడుబడిపోయిందని, నందమూరి వారసులు ఆ ఇల్లు అమ్మకానికి పెడదామనే ఆలోచనలో ఉన్నారని అప్పట్లో వార్తలొచ్చాయి. అమ్మేసుంటే ఎంతకమ్మారు? ఎన్టీఆర్ భార్య లక్ష్మీపార్వతికి ఇవ్వాల్సిన వాటా ఇచ్చారా? లేదా ఆ ఇంటిని ఎన్టీఆర్ స్మారక మ్యూజియంలా తయారుచేయాలని అభిమానులు ఆశించినట్లుగా వారసులేమైనా ప్రయత్నాలు చేస్తున్నారా? వీటికోసం కూడా మన మీడియాలో వార్తలొస్తే బాగున్ను. ప్రపంచంలోకెల్లా అత్యంత నికృష్టమైన రాజకీయాలకు అడ్డా ఏపీనే. అన్నమీద కోపంతో అయ్య పేరు చెప్పుకొని తెలంగాణలో షర్మిల తిరిగారు. గతంలో ఆమె సమైక్యవాది. జనం ఛీకొట్టేసరికి తత్వం బోధపడింది. అప్పటికే కోట్లు ఖర్చయిపోయాయి. ఏ కుటుంబమైతే తమకు ద్రోహం చేసిందో ఆ కాంగ్రెస్ పంచనే చేరింది. కాంగ్రెస్ అంటేనే ఓ దగుల్బాజీ పార్టీ. ఇప్పుడు కాగల కార్యం షర్మిల తీరుస్తోందన్నట్టుగా ఇప్పుడు టీడీపీ, దాని మీడియా ఖుషీగా ఉంది. ఏ చంద్రబాబు తన కుటుంబాన్ని తొక్కాడో, అదే చంద్రబాబు మళ్లీ కుర్చీ ఎక్కారు. అంటే అదే చెల్లి అన్నను భ్రష్టుపట్టించింది. ఆమె ఇప్పుడు అమాయకంగా నీకు ప్రేమలకన్నా ఆస్తులు ఎక్కువా? అని అడుగుతుంది. మరి ఆస్తుల కోసమే కదా షర్మిల వైఎస్ కుటుంబ ద్రోహులతో చేతులు కలిపింది. లేడీ విభీషణ అవతారమెత్తింది. అంటే ఇక్కడ జగన్ రావణాసురుడని కాదు. ఒకవేళ అలా అనుకున్నా పెద్ద ఇబ్బందేమీ లేదు. కాకపోతే చంద్రబాబును రాముడనుకుంటున్న ఆమె అజ్ఞానమే ఆశ్చర్యం. ఇప్పుడు సరస్వతి షేర్ల బదిలీ మీద వివాదం. నన్ను వ్యతిరేకించి, నా ప్రత్యర్థులతో చేతులు కలిపి నన్ను బద్నాం చేస్తావా అనేదే జగన్ అభ్యంతరం. అందుకే తల్లీ లేదు, చెల్లీ లేదు అనే అభిప్రాయానికి వచ్చారు. సహజంగానే భారతి ప్రభావం ఉంటుంది. ఈ షేర్ల బదిలీ వెనుక టీడీపీ కుట్ర, బెయిల్ రద్దు దుర్మార్గం ఉందని జగన్ అంటున్నారు. ఇక్కడ ఎవరైనా రాజకీయమే ఆలోచిస్తారు. ఐదేళ్లు అధికారం కోల్పోయిన తర్వాత చంద్రబాబు ఇటువంటి స్కెచ్‌లో ఉండరని భావించక్కర్లేదు. ఎందుకంటే.. జగన్మోహన్‌రెడ్డి సరైనోడు ఒక్కడ్ని ఎంపిక చేసుకోలేదు. ఇప్పుడు జగన్ కోసం మాట్లాడే తటస్థుడు కరువైపోయాడు. సాయిరెడ్డి, సుబ్బారెడ్డి లాంటి వారు మాట్లాడితే జగన్ మోచేతినీళ్లు తాగినవారే కదాని షర్మిల తీసిపారేస్తోంది.



## వెనుకబడ్డ జాతి పేరుకు జయకేతనం

చదువంటే తెలియని తెగ నుంచి.. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సాధించింది! చదివి తీరాల్సిన ఓ విజయగాథ ఆ ఒడిశా అమ్మాయి అకాడమిక్ జర్నీ!! మనిషిలో తపన ఉండాలేగానీ.. తమ సాధనకు అడ్డుపడే శక్తులేముంటాయి..? అలాంటి సక్సెస్ స్టోరీస్ కొల్లలు. ఈ మధ్యే ట్వల్త్ ఫెయిల్ సినిమాలో మనోజ్ కుమార్ ఐపీఎస్ సక్సెస్ స్టోరీని ఇన్స్పైరింగ్‌గా చూపించారు. అలాంటి మరో జీవి గురించే మనం చెప్పుకోబోతున్నాం. నాగరిక సమాజంలో కూడా అనాగరిక బతుకీడుస్తున్న గిరిజన తెగకు ఇప్పుడామె ప్రైడ్. అసలు ఆమె గురించి తెలుసుకునేకంటే ముందు.. ఆమె తెగ గురించి చెప్పుకోవాల్సిన అవసరమూ ఉంది. అదే బోండా గిరిజన తెగ. అత్యంత వెనుకబడిన జాతి. నాగరిక సమాజంలో ఒకళ్లను మించి మరొకళ్లు తమ తెలివితేటలను ప్రదర్శిస్తూ దూసుకుపోతున్న రోజుల్లో ఆ నాగరిక సమాజ పోకడలే తెలియని దైన్యస్థితిననుభవిస్తున్న అనాగరిక, ఆటవిక జాతి బోండా గిరిజన తెగ. ఇదేదో మనం ఆ జాతి పరిస్థితిని అంచనా వేస్తూ జనరలైజ్డ్‌గా చేసే కామెంట్ కాదు. కేంద్ర ప్రభుత్వ అధ్యయనం వెలిబుచ్చిన అభిప్రాయం. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో.. నేటి నాగరిక సమాజానికి దూరంగా ప్రాథమిక జీవనానికీ బోండా జాతి తమ బతుకీడుస్తున్నట్టు ఆ అధ్యయనాలు పేర్కొన్నాయి. - రమణ కొంటికర్ల

# ఆ యువతి విజయగాథ!

వీరిని పీవీటీజీగా గుర్తించారు. అంటే పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్‌గా ఎంపిక చేసింది కేంద్ర ప్రభుత్వం. ఒక ప్రత్యేక ఉపవర్గంగా ఇలాంటి 75 జాతులను గుర్తించగా వాటిలో బోండా తెగ ఒకటి. వ్యవసాయం, లేదా అడవుల్లో దొరికే ఆకులు అలములు అమ్ముకుని బతకడం వంటి కార్యకలాపాలు మినహా నాగరిక సమాజంలో ఎలాంటి పనులుంటాయి.. తామూ ఆ పనులెలా చేయొచ్చు. అసలు విద్య వల్ల ఒనగూరే ప్రయోజనాలేంటి.. ఉద్యోగాలెలా సంపాదించొచ్చు వంటి కనీస అవసరాల గురించే తెలియని జాతిలో పుట్టి.. ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ర్యాంకు సాధించింది కాబట్టే మనం ఇప్పుడు ఓ వ్యక్తి గురించి మాట్లాడుకోబోతున్నాం. ఆమే ఒడిశాకు చెందిన బినీ ముదులీ. మాల్కాన్‌గిరి జిల్లా గోవిందపల్లి సమీపంలోని ఖేమగుడ గ్రామం బినీది. తండ్రి రామ్ ముదిలి ఒక పాఠశాలలో వంటవాడు. తల్లి సునామణి కిర్సాని ఓ అంగన్‌వాడీ వర్కర్. బినీ ప్రాథమిక విద్యంతా ముదులిపాడా ప్రాథమిక పాఠశాలలో కొనసాగింది. అసలు చదివించడమే గొప్పైన వెనుకబడ్డ బోండా తెగలో పట్టువదలని విక్రమార్కురాలిగా మారి.. తల్లిదండ్రులను ఒప్పించి జవహర్ నవోదయ్ విద్యాలయం ఎంట్రన్స్ ఎగ్జామ్ రాసి అక్కడా సీటు సంపాదించింది. తన మాధ్యమిక విద్యను అక్కడ పూర్తి చేసిన ముదులీ ఆ తర్వాత జైపూర్‌లోని విక్రమ్‌దేవ్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఆ తర్వాత ఓ ఆయుర్వేద వైద్యుడి దగ్గర పనిచేసింది. అయితే, ఆమెలో మాత్రం ఏదో సాధించాలన్న కసి రగులుతూనే ఉండేది. అలా ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్‌వన్ పేపర్‌కు ప్రిపేరైంది. 2020కు ముందు ప్రయత్నాలను ప్రారంభించి 2020 పరీక్షల్లో ఫెయిలైంది. కానీ, వెనకడుగు వేయలేదు సరికదా.. 2022లో 596వ ర్యాంక్ సాధించి వార్తల్లో వ్యక్తైంది. ఎందుకంటే, అసలు అత్యంత వెనుకబడ్డ 75 ఉప తెగల్లో ఒకటైన బోండా తెగ నుంచి మొట్టమొదటి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగం సాధించిన ఘనత బినీ ముదులీది. అలా 24ఏళ్లకే ఆమె ఓ గ్రూప్ వన్ ఆఫీసర్‌గా అవతరించిన కథ ఇప్పుడు సోషల్ మీడియా, మీడియాల్లో మారుమ్రోగిపోతోంది. అయితే, ఆమె ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎగ్జామినేషన్ ప్రిలిమినరీ, మెయిన్స్‌లో మంచి ర్యాంకులో ఉత్తీర్ణులవ్వడం వెనుక ఎంతో కష్టం దాగుంది. తనకు చదువుకునేందుకు, కోచింగ్ తీసుకోవడానికి డబ్బుల్లేక.. యూట్యూబ్ పాఠాలు చూసి.. ఆన్లైన్ కోర్సుల ద్వారా చదివి.. మాక్ టెస్టుల్లో పాల్గొంటూ ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎగ్జామ్ కు ప్రిపేరైంది. అలా తనకు తానే ఓ మోటివేటరై తాననుకున్న లక్ష్యాన్ని సాధించింది బినీ ముదులీ.

### బినీ కామెంట్స్..

నా కోచింగ్‌ను నా తల్లిదండ్రులు భరించలేరని నాకు తెలుసు. కానీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణురాలిని కావాలనే నా కలను సాధించడంలో మాత్రం.. ఆ సమస్యే నాకు ఆటంకంగా మారొద్దని నేను ముందే నిర్ణయించుకున్నా. అందుకే, సమస్యను ముందు గుర్తించి.. దానికి ప్రత్యామ్నాయ మార్గంగానే తక్కువ ఖర్చులో ఒడ్డెక్కే ఆన్లైన్ కోర్సులు, యూట్యూబ్ పాఠాలతో.. నా లక్ష్యాన్ని చేరుకున్నానంటోంది బినీ. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష అంటే ఆశామాషీ కాదనే విషయం నాకూ తెలుసు. అందుకే, ఎందరో టాపర్స్‌కు సంబంధించిన వీడియో ఇంటర్వ్యూస్‌ని బాగా చూసేదాన్నని.. పత్రికల్లో వచ్చే ఇంటర్వ్యూస్‌తోపాటు.. అకాడమిక్ స్టడీస్, పోటీ పరీక్షలకు సంబంధించిన ఆర్టికల్స్‌నూ ఫాలో అయ్యేదాన్ననీ చెబుతోంది బినీ ముదులీ. అయితే, తన ఎదుగుదలలో తన తల్లిదండ్రులు, గురువుల పాత్రనూ కొనియాడుతున్న బినీ విజయం ఇప్పుడా కుటుంబానికే పరిమితమైంది కాదు.. మొత్తంగా బోండా సామాజికవర్గానికే ఓ సెలబ్రేషన్. బినీ ముదులీ దారిలోనే ఇదే సామాజిక వర్గానికి చెందిన మరో మంగళ ముదులీ కూడా నీట్‌లో ర్యాంక్ సాధించి ఎంబీబీఎస్ చేస్తూ.. తన డాక్టర్ కలను చేరుకునే క్రమంలో ప్రయాణిస్తోంది. ఇంటర్నెట్, సోషల్, డిజిటల్ మీడియా తెచ్చిన రెవల్యూషన్‌తో.. ఏం సాధించవచ్చనడిగేవాళ్లకు ఇప్పుడు వెనుకబడ్డ జాతి నుంచి చదువుకోవాలన్న తపనతో ఒడిశా సివిల్ సర్వీసెస్‌గా పిల్చుకునే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో జయకేతనమెగురేసిన బినీ ముదులీని చూపొంచొచ్చు. అలాగే, చదువు జీవితాలను ఎలా సుసంపన్నం చేస్తుంది. చీకటి బతుకుచిత్రాల్ని కూడా ఎంత ప్రకాశవంతంగా మారుస్తుందో చెప్పే కథ బినీ ముదులీ సక్సెస్ స్టోరీ.

సాంకేతిక వర్గం: 'లగ్గం' కోసం పేరున్న టెక్నీషియన్లే పని చేశారు. మణిశర్మ నేపథ్య సంగీతం అందిస్తే.. బాల్ రెడ్డి ఛాయాగ్రహణం సమకూర్చాడు. ఆర్ఆర్ కంటే చరణ్ అర్జున్ పాటలు మెరుగ్గా అనిపిస్తాయి. బాల్ రెడ్డి ఛాయాగ్రహణం బాగానే సాగింది. విజువల్స్ కలర్‌ఫుల్‌గా సాగాయి. నిర్మాణ విలువలు సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. రైటర్ కమ్ డైరెక్టర్ రమేష్ చెప్పాల ఓకే అనిపిస్తారు. ఎంచుకున్న పాయింట్లోనే కొత్తదనం లేకపోయినా మంచి సబ్జెక్టునే ఎంచుకు న్నారు. కథ మొదలైనపుడే దీని ముగింపు ఎలా ఉంటుందో అర్థమైపోతుంది. దర్శకుడి నరేషన్ పాత తరహాలో అనిపిస్తుంది .. మరీ నెమ్మదిగా సాగడంతో ప్రేక్షకులను ఎంగేజ్ చేయడం కొంచెం కష్టమైపోయింది.

**నటీనటులు:** సాయి రోనక్-ప్రగ్యా నగ్రా-రాజేంద్ర ప్రసాద్-రోహిణి-వడ్లమాని శ్రీనివాస్-రఘుబాబు-సప్తగిరి-కిరీటి-కృష్ణుడు-చమ్మక్ చంద్ర తదితరులు **సంగీతం:** చరణ్ అర్జున్ **నేపథ్య సంగీతం:** మణిశర్మ **ఛాయాగ్రహణం:** బాల్ రెడ్డి **నిర్మాత:** వేణుగోపాల్ రెడ్డి **రచన-దర్శకత్వం:** రమేష్ చెప్పాల

తెలుగు తెరపై ఇటీవల తెలంగాణ పల్లె కథల జోరు సాగుతోంది. ఈ కోవలోనే 'లగ్గం' అనే సినిమా తెరకెక్కింది. సాయి రోనక్-ప్రగ్యా నగ్రా జంటగా కొత్త దర్శకుడు రమేష్ చెప్పాల రూపొందించిన ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.




# సందేశం మంచిదే..కానీ!

**కథ:** అర్జున్ (సాయి రోనక్) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అతడికి తన మేనమామ (రాజేంద్రప్రసాద్) కూతురైన మానస (ప్రగ్యా నగ్రా) అంటే చాలా ఇష్టం. అతడి మేనమామ ఒక రోజు హైదరాబాద్ వచ్చి అల్లుడి ఉద్యోగం.. జీతం.. తన వైభోగం అంతా చూసి తననే అల్లుడిగా చేసుకోవాలనుకుంటాడు. చిన్నప్పటి నుంచి అనుకున్న సంబంధమే కావడంతో ఇరు కుటుంబాల్లో అభ్యంతరాలేమీ ఉండవు. పెళ్లికి ఘనంగా ఏర్పాట్లు జరుగుతాయి. కానీ ఇంతలో పెళ్లికి అనుకోని అవాంతరాలు ఎదురవుతాయి. జరగాల్సిన సమయానికి పెళ్లి జరగదు. ఇందుకు కారణం అర్జునే అని తర్వాత తెలుస్తుంది. ఇంతకీ ఈ పెళ్లిని అతనెందుకు ఆపించాలనుకున్నాడు.. అందుకు దారి తీసిన పరిస్థితులేంటి.. తర్వాత అయినా అర్జున్-మానస ఒక్కటయ్యారా లేదా అన్నది మిగతా కథ.

### నటీనటులు:

సాయి రోనక్ బాగున్నాడు. నటన కూడా ఓకే. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ పాత్రలో బాగానే ఒదిగి పోయాడు. తర్వాత రైతు పాత్రలోకి మారినపుడు మాత్రం సూట్ కాలేదనిపించింది. ఎమోషనల్ సీన్లలో రోనక్ బాగా చేశాడు. హీరోయిన్ ప్రగ్యా నగ్రా పర్వాలేదు. తన లుక్స్.. అలాగే నటన యావరేజ్ అనిపిస్తాయి. రాజేంద్ర ప్రసాద్ తనకు నప్పని పాత్రను చేశాడిందులో. తెలంగాణ యాసలో డైలాగులు చెప్పడానికి ఆయన బాగానే కృషి చేసిన ప్పటికీ.. అవి అసహజంగానే అనిపిస్తాయి. చాలా సీన్లు కూడా అలాగే తయారయ్యాయి. ఇంకా చాలా మంది ఆర్టిస్టుల మిస్ ఫిట్ అనిపించారు. రోహిణి మాత్రం అలాంటి ఫీలింగ్ కలిగించలేదు. చాలా బాగా నటించి మెప్పించింది. సప్తగిరి.. రఘుబాబు.. చమ్మక్ చంద్ర.. ఇలా చాలామంది కమెడియన్లు ఉన్నా ఎక్కడా కామెడీ పండలేదు.

### కథనం-విశ్లేషణ:

మన దేశంలో.. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో సాఫ్ట్ వేర్ ఉద్యోగాలకు ఉండే క్రేజే వేరు. ఐదంకెల జీతం.. విలాసవంతమైన జీవితం.. వారానికి రెండు రోజుల సెలవు.. విదేశీ ప్రయాణం.. అక్కడే సెటిలయ్యే అవకాశం.. ఇలా బోలెడన్ని సౌలభ్యాలుంటాయి. కానీ ఆ ఉద్యోగాల్లో ఉండే ఒత్తిడి.. ఉద్యోగ అభద్రత.. విదేశాల్లో పని చేస్తూ సొంత కుటుంబ సభ్యులతోనే బంధం కోల్పోవడం నాణేనికి రెండోవైపు కనిపించే కోణాలు. ఇలాంటి అనుకూలతలు-ప్రతికూలతలు చాలా వృత్తుల్లో.. ఉద్యోగాల్లో ఉన్నప్పటికీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఉండే క్రేజ్-డిమాండ్ వల్ల దీని గురించి ఎక్కువ చర్చ జరుగుతుంటుంది. ఈ అంశాలను చాలా సినిమాల్లో ఇప్పటికే టచ్ చేశారు. ఐతే 'లగ్గం' సినిమాలో ఈ పాయింట్ మీదే పూర్తి కథను నడిపించేశారు. తన మేనల్లుడు చేస్తున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగంలో ఉన్న సానుకూలతలు చూసి దాన్ని మించిన కొలువు లేదని ఫీలయ్యి అతడికి కూతురునిచ్చి పెళ్లి చేయబోయిన ఓ తండ్రి.. అతడిరా ఉద్యోగం పోయిందని తెలిస్తే ఎలా స్పందించాడనే నేపథ్యంలో 'లగ్గం' నడుస్తుంది. ఈ కథ ద్వారా మంచి విషయాలు చెప్పాలనుకోవడం.. సందేశం ఇవ్వాలనుకోవడం బాగానే ఉన్నా.. కథలో కొత్తదనం లేకపోవడం.. నరేషన్ ఓల్డ్ స్టయిల్లో సాగడం.. చాలా సన్నివేశాలు సాగతీతగా తయారవడం.. అన్నింటికీ మించి తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో సాగే సినిమాలో నేటివిటీకి తగ్గ నటీనటులను ఎంచుకోకపోవడం వల్ల ఈ 'లగ్గం' ఇంపాక్ట్ చూపించలేకపోయింది.

'లగ్గం' కథ పూర్తిగా తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో నడుస్తుంది. అలాంటపుడు అక్కడి యాసను సహజంగా పలికే.. అక్కడి మనుషుల్లా అనిపించే ఆర్టిస్టులను ముఖ్య పాత్రలకు పెట్టుకోవడం కీలకం. వేరే ప్రాంతాల ఆర్టిస్టులు ఇలాంటి సినిమాల్లో నటించకూడదన్న షరతులేమీ లేవు కానీ.. ఆంధ్ర యాసతో బాగా అలవాటైన నటీనటులు ఇలాంటి రూటెడ్ స్టోరీలో ముఖ్య పాత్రల్లో కనిపిస్తుంటే.. వారి యాసలో అసహజత్వం ఉట్టిపడుతుంటే ఆ క్యారెక్టర్లను ఓన్ చేసుకోవడం కొంచెం కష్టమే అవుతుంది.

తొలి గంటలో 'లగ్గం'లో కొత్తగా చెప్పుకోదగ్గ సన్నివేశాలు పడలేదు . కథలో హీరో హీరోయిన్ల మధ్య లవ్ స్టోరీ కూడా ఏమీ ఉండదు. మేనమామకు తన మేనల్లుడు-అతను చేసే ఉద్యోగం నచ్చడం.. పెళ్లికి అందరూ పచ్చ జెండా ఊపేయడం.. ఆ తర్వాత పెళ్లికి ఏర్పాట్లు చేయడం.. ఇలా అంతా మామూలుగా నడిచిపోతుంది. తెలంగాణ పల్లెటూళ్లలో పెళ్లి తంతును కొంచెం వివరంగా చూపించడం మాత్రం కొంచెం ఆసక్తికరంగా అనిపిస్తుంది. ఇక పెళ్లి ఆగిపోవడంతో ఇంటర్వెల్ దగ్గర కథ మలుపు తిరిగే ఎపిసోడ్ కూడా ఏమంత ఎఫెక్టివ్ గా అనిపించదు. పెళ్లి ఆగిపోవడానికి దారి తీసిన కారణం చూస్తే సిల్లీగా అనిపిస్తుంది. ద్వితీయార్ధంలో తిరిగి హీరో హీరోయిన్లను కలిపి పెళ్లి చేయడం ఎలా అనే కోణంలో కథ నడుస్తుంది. ప్రథమార్ధంతో పోలిస్తే రెండో అర్ధంలో ఎమోషన్లు పండాయి. కొన్ని సన్నివేశాలు హృద్యంగా సాగుతాయి. అక్కడక్కడా మంచి డైలాగులు కూడా పడ్డాయి. సెకండాఫ్ వరకు 'లగ్గం' పర్వాలేదనిపిస్తుంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# పిల్లలు 'సెల్' లోనే ఉంటున్నారు!




**.. మా పిల్లాడికి మూడేళ్లె కానీ నేను పెట్టిన ఫోన్ లాక్ ఎంచక్కా ఓపెన్ చేసేస్తాడు ..ఇలా గొప్పలకి పోయే ఓ తల్లి...కాసేపు చూసి ఇచ్చేయాలి మరి అని పిల్లాడి చేతిలో ఫోన్ పెడుతుంది మరో అమ్మ... వాడికి ఫోన్ ఇచ్చేస్తే చూసుకు ఊరుకుంటాడు వెధవ అని సినిమా హాల్లో భార్యతో ఓ తండ్రి... గతంలో సినిమా చూస్తుండగా పిల్లాడు ఏడిస్తే భర్త వాడిని ఎత్తుకుని బయటకి తీసుకెళ్ళి తిప్పేవాడు.. ఇప్పుడు అంత సినిమా లేదు.మొబైల్ చేతిలో పెట్టేస్తే సరి.. వీళ్ళు సినిమా చూసిన రెండున్నర గంటలు వాడు మొబైల్ చూస్తూ కూర్చుంటాడు. మా అమ్మాయి సెకండ్ స్టాండర్డ్ నిమిషం ఖాళీ ఉండదండి నిరంతరం ఆన్లైన్ క్లాసులు ఉంటూనే ఉంటాయి ఇది ఇంకో ఆధునిక స్త్రీ బడాయి..**

ఇలా పిల్లలు అతిగా ఫోన్ వాడడం వలన వారి మానసిక, శారీరకంగా ఎలాంటి దుష్పరిణామాలు ఎదుర్కుంటారో తల్లిదండ్రులు గ్రహించడం లేదు. స్మార్ట్‌ఫోన్ అడిక్షన్ బాధితుల్లో అరవై శాతం ఎనిమిది నుండి పద్దెనిమిది వయసువారు కాగా మరో ముప్పై శాతం పాతికేళ్ల నుంచి ఏభై ఏళ్ల వయసు వారు ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి. దీని ఫలితంగా పిల్లలు నిద్రకి దూరం కావడం, డిప్రెషన్, ఆకలి మందగించటం, మతిమరుపు, అసహనం, కోపం, విసుగు, కళ్ళలో తరచూ నీరు కారటం, స్పాండిలైటిస్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ క్రమంలో కొంతమంది పిల్లల మొబైల్ వ్యసనం గురించి మాట్లాడుతూ స్క్రీన్ టైం పై నియంత్రణ ఉండాలి చెబుతున్నారు. స్క్రీన్‌టైం పై నియంత్రణ ఉండాలంటే కుదురుతుందా. పద్దెనిమిది ఏళ్ళ లోపు వారు మద్యం తాగకూడదు అని నిబంధన పెట్టీ ఒక పెగ్గు పర్వాలేదు అని చెప్పలేం కదా. కాసేపు పిల్లలు మొబైల్ చూసినా ప్రీ ఫ్రంటల్ కార్టెక్స్ అభివృద్ధి చెందివుండదు. దాని వల్ల ఒక దానికి అలవాటు అయితే వదలలేరు. స్వీయ నియంత్రణ ఉండదు. పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వొద్దు అని చెప్పాలి. కానీ డాక్టర్లు చెప్పరు, ప్రభుత్వాలు పట్టించుకోవు. ఎందుకంటే నిజంగా పిల్లలందరూ సెల్‌ఫోన్ వాడడం మానేస్తే సెల్ ఫోన్ అమ్మకాలు... డేటా బిజినెస్.. ఆన్లైన్ బెట్టింగ్ లాంటివి ఇప్పుడున్నదానిలో... ఇరవై శాతా నికి పడిపోతాయి. కాబట్టి వీరు నిజాలు చెప్పరు. సన్నాయి నొక్కులు నొక్కుతూనే వుంటారు. ఇంకో విషయం.. స్కూల్‌లో తోటి పిల్లలు, ఏమి చేస్తే మన పిల్లలలు కూడా అదే చేస్తారు. స్కూల్‌లో తోటి పిలల్లు" ఆ గేమ్.. ఈ పోర్న్ వీడియో" అని డిస్కస్ చేస్తుంటే... మనింటి బంగారం ఊరకుండదు. స్కూల్‌స్థాయిలో సెల్ ఫోన్ నిషేధించాలి. ఆవులు, ఎడ్లు చేలో మేస్తుంటే దూడలు గట్టునే ఎలా మేస్తాయి ?అమ్మ నాన్న మొబైల్ బానిసలు. ఒకపక్క స్టార్ ఆసుపత్రులను... మరో పక్క ఇంటర్నేషనల్ బడులను కొనుగోలు చేస్తున్న విదేశీ కంపెనీలు.. వారికి కావలసింది వ్యాపారం. ప్రతి ఒక్కడి రక్తం పీల్చేస్తున్నారు. ఉచిత ఆరోగ్య పరీక్షలు– స్టార్ ఆసుపత్రులు, ఉచిత టాలెంట్ టెస్ట్‌లు – విద్యా సంస్థలు బకరాలను పట్టడానికి వేసే గాలాలు. చూస్తూ వుండండి. జనవరి లోగా లక్షల మంది పడుతారు. మావాడి మెరిట్‌కు మెచ్చి ఫిట్టింగ్ జీ వాడు డెబ్బై శాతం ఫీజు తగ్గించారు అని మురిసిపోతారు. నాలుగు రెట్లు పెంచి కొంత తగ్గించడం అనే మర్మం తెలియక పాపం తల్లిదండ్రులు ఆ మయాలో పడతారు. అదండీ నేటి లోకం . దోచుకున్నోడికి దోచుకొన్నంత. సైబర్‌ఫ్రాడ్.. రీల్స్ చెయ్యడం.. స్టార్ ఆసుపత్రులకు రోగులను, ఇంటర్నేషనల్ స్కూల్స్‌కు అడ్మిషన్స్ తెచ్చిపెట్టడం.. గంజాయి డ్రగ్స్ స్మగ్లింగ్, నేటి పెద్దపెద్ద స్వయం ఉపాధి పథకాలు..

**- సీహెచ్.దుర్గాప్రసాద్**

సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు

## జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్‌లో వచ్చేనెల 6 నుండి 10 వరకు జరగబోయే జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కి జిల్లా నుండి ముగ్గురు బాలురు ఎంపికయ్యారు. మెట్ట హర్షవర్ధన్, పూజారి కళ్యాణరామ్, చింతాడ జస్వంత్‌లు ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసింహారాజు, సెక్రటరీ సిగిలిపెల్లి లక్ష్మిదేవిలు తెలిపారు. వీరికి ఈనెల 29 నుంచి వచ్చేనెలా 4 వరకు అనంతపురంలోని ఆర్‌డీటీ మైదానంలో కోచింగ్ క్యాంపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.వి.రమణ, మెట్ట తిరుపతిరావు, సభ్యులు జి.మల్లేష్, పి.వెంకటరమణ పాల్గొన్నారు.



## అపజయాలతో కృంగిపోవద్దు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులు దృఢమైన మనస్సుతో అపజయాలకు కృంగిపోకుండా విజయాలకోసం మరింత పోరాడి సాధించి లక్ష్యాలు అందుకోవాలని శాంతినికేతన్ జూనియర్ కాలేజీ డైరెక్టర్ సురంగి మోహనరావు అన్నారు. నగరంలోని ఇలిసిపురం ప్రాంతంలో గల తిలక్‌నగర్ నర్సెస్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో చిన్నారులకు ఉచిత చెస్ ప్రవేశ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నిత్యం చదరంగం క్రీడ అడటం వలన లాజికల్ మైండ్ డెవలప్ అవుతుందన్నారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిడే ఇర్నేషనల్ రేటింగ్ చెస్ క్రీడాకారులు, స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ చెస్ కోచ్‌లు భేరి చిన్నారావు, కె.సాయి నిరంజన్ సింగ్, సీనియర్ చెస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ పెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.గణేష్, ఎన్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం శ్రీకాకుళం కార్పొరేషన్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టబద్ధమైన సెలవులు, వారాంతపు సెలవులు వెంటనే అమలు చేయాలన్నారు. సాధారణ ప్రమాద మరణాలకు ఎక్స్‌గ్రేసియా చెల్లింపులు వెంటనే జరపాలన్నారు. దహన సంస్కారాలకు రూ.15 వేల నుండి 20 వేలకు పెంచాలని కోరారు. 4 రకాల ఇపిఎఫ్ ఖాతాలను ఒకే ఖాతా కిందకు జమచేయాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధంగా జీఓ నంబరు 36ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నివారించాలని డిమాండ్ చేశారు. ఆ కమిటీలో మహిళలను సభ్యులుగా చేర్చాలి. విజయవాడ వరదముంపు సందర్భంగా శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొన్న కార్మికులందరికీ ఒకనెల జీతం బోనస్‌గా ఇవ్వాలన్నారు. కార్పొరేషన్ విస్తీర్ణ పరిధికి అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. కొంతమంది వార్డు ఇన్‌చార్జులు కార్మికులపై పనిభారం మోపి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, పంచాయతీ నాయకులు నాయకులు ఎ.జ్యోతిప్రసాద్, రాఘవ, ఇంజనీరింగ్ కార్మికులు పి.మణికంఠ, గిరిజాశంకర్, క్లాప్ డ్రైవర్లు నారాయణ, రామకృష్ణ, హరి, సత్తిబాబు, ఎ.శంకర్, డి.చిట్టి, ఎ.రాము, ఎ.శేఖర్, ఎ.దేవసంతోష్, పి గణేష్, జె.మాధవి, ఎ.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నాగవంశీయులకు సంక్షేమ నిధి ఏర్పాటు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అత్యంత వెనుకబడిన కులాల్లో ఒకటైన నాగవంశంలో పేదల సంక్షేమానికి ఒక నిధిని ఏర్పాటు చేయాలని నగరానికి చెందిన వివిధ రంగాల ప్రతినిధులు నిర్ణయించారు. ఆదివారం అంబేద్కర్ ఆడిటోరియంలో మల్లిక సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సర్వసభ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జర్నలిస్టు నల్లి ధర్మారావు సంఘం బలోపేతానికి అందరూ కృషి చేయాలని కొనియాడారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థికంగా ప్రోత్సాహం ఇవ్వడం, పేద కుటుంబాల సంక్షేమానికి అండగా ఉండటం వంటి కార్యక్రమాలతో పాటు, నగరంలో ఒక సంక్షేమ భవనాన్ని నిర్మించుకోవడానికి కూడా కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది. అనంతరం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముని శ్రీనివాసరావు, సెక్రెటరీగా మొఖర వెంకట మల్లేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా నల్లి అప్పలనాయుడు ఆర్గనైజేషన్ సెక్రటరీగా బోణ రాజేశ్వరరావు, కోశాధికారిగా కొన్ని సూరిప్రకాష్, ఉపాధ్యక్షులుగా కనకల రామారావు, బోణి వెంకట రవిశంకర్, రాంబుక్త సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా కంటుభుక్త బుచ్చిబాబు, బోనెల ప్రసాదరావు మొఖర ధర్మారావు, కార్యవర్గసభ్యులుగా డొంక అప్పారావు, అనకాపల్లి రామారావు, జరజాపు నారాయణరావు, కాళ్ల రాజు, అనకాపల్లి ఆనందరావు, కనకల సత్తిబాబు, కనకల శ్రీనివాసరావు, రాంభుక్త బుచ్చిబాబు, కనకల శివకుమార్, బోణ శంకర్‌లు కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు.

కార్యక్రమంలో పొడుగు శ్యాంసుందర్, ఒకరు నారాయణమూర్తి, కంటుబుక్త నూకరాజు, డొంక శ్రీరాములు, రాంబిల్లి రామారావు, కొండల సూర్యనారాయణలు పాల్గొన్నారు.

## కరెంటు చార్జీల పెంపు విడ్డూరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బీజేపీ, టీడీపీ, జనసేనలు ఒక కూటమిగా ఏర్పడి అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీల పెంచి పేదల నడ్డి విరిచిందని డీసీసీ అధ్యక్షులు అంబటి క్రిష్ణారావు విమర్శించారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యతరగతి, పేద ప్రజల నడ్డి విరిచే విధంగా అనేక హామీలను తుంగలో తొక్కి ఇప్పుడు ఎఫ్.పీ.సీ.సీ.ఏ. పేరుతో కరెంటు చార్జీలను పెంచి అధిక భారాన్ని వారిపై మోపడం కూటమి ప్రభుత్వం నిజస్వరూపాన్ని తెలుపుతుందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని, పెంచిన కరెంటు చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ప్రజల తరుపున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

## డిఆర్‌ఓగా వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా రెవిన్యూ అధికారిగా మారెళ్ళ వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో టెక్కలి ఆర్డీఓగా పని చేసిన వెంకటేశ్వరరావు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పని చేసి శ్రీకాకుళం డీఆర్వోగా బదిలీపై వచ్చారు.




## వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వైభవంగా కళ్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్వీయుజ బహుళ ఏకాదశి పురస్కరించుకొని స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో వై.భద్రాజీలు తెలిపారు.



## ఓబీసీ సాధనే మా లక్ష్యం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**- అందరి సహకారంతో సంఘాన్ని ట్రస్టును, బలోపేతం చేస్తాం**

**- కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు**

కళింగ కోమటి జాతిని ఓబీసీలో చేర్పేందుకు తొమ్మిదేళ్లుగా అవిరామంగా పోరాటం చేస్తున్నామని, ఓబీసీ సాధనే తమ సంఘం లక్ష్యమని కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు అన్నారు. నగరంలోని వైశ్యరాజు కళ్యాణ మండపంలో కళింగకోమటి సంఘం రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యక్షులు బోయిన గోవిందరాజులు మాట్లాడుతూ జాతిలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించేలా తమపై పెద్ద బాధ్యతను ఉంచారన్నారు. ప్రధానంగా కళింగ కోమటి జాతికి ఓబీసీ సాధించాల్సిన బాధ్యత ఉందన్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుల సహకారంతో వీటిని సాధిస్తామన్న నమ్మకం తమపై ఉందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఓబీసీ సాధన కోసం పూర్తిస్థాయిలో పోరాటం చేస్తామని వివరించారు. 2015 నుంచి ఓబీసీ సాధన కోసం పోరాటం సాగిస్తున్నామని ఇది తుది దశకు వచ్చిందని తెలిపారు. ట్రస్టు కోసం అప్పలరాజు కొంత ఆస్తిని ఇచ్చి, అప్పట్లో కొందరు దాతలు సహకారంతో భవన నిర్మాణం చేసి జాతికి అంకితం చేశారన్నారు. కొన్ని సంఘాలు ఈ ట్రస్టు మా సంఘానిదంటే మా సంఘానిదంటే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ట్రస్టు జాతికే చెందుతుందని స్పష్టం చేశారు. ట్రస్టు అనేది రాష్ట్ర, జిల్లా పట్టణ, నగర సంఘాలకు సంబంధం లేదని చెప్పారు. అన్ని సంఘాలు ఇప్పుడిప్పుడే ఒకే తాటి పైకి వస్తున్నాయన్నారు. జాతిలో ప్రతీ ఒక్కరిలో చైతన్యం రావడంతో యువతతో పాటు అనుభవజ్ఞులైన వారు తమ సంఘంలో ప్రాధాన్యత కల్పించాలని కోరారని, ఆశావహులు కూడా పెరగడం ఆనందంగా ఉందని వివరించారు. అయితే మూడు నెలలుగా సుదీర్ఘంగా ఆలోచనలు చేసి ప్రణాళికా బద్ధంగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని చెప్పారు. జాతిలో 80 శాతం వరకు పేదవారు ఉన్నారని, ఆస్తి విషయంలో గొడవలు, భార్యాభర్తల గొడవలు తారాస్థాయికి చేరుతున్నాయన్నారు. ఊన్న సర్వేశ్వరరావుతో ఓ కమిటీని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతానని తెలిపారు. అనంతరం సంఘ గౌరవాధ్యక్షులుగా వి సర్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కోరాడ శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా పట్నాన కిరణ్‌ను, గౌరవ రాష్ట్ర కన్వీనర్లుగా అంధవరపు సూరిబాబు, కోణార్క్ శ్రీను, పీవీ రమణలతోపాటు 376మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బరాటం శ్రీరామ్మూరి, ఎన్ వి శేషగిరి, ప్రసాద్, జామి భీమశంకర్, బరాటం. నాగేశ్వరరావు, తంగుడు. నాగేశ్వరరావు, తంగుడు జోగారావు, కోరాడ రమేష్, మీడియో కోఆర్డినేటర్స్ వైశ్యరాజు మోహన్, పొ ట్నూరు గణేష్, పొట్నూరు అనంత్, వారణాసి బుజ్జి, టంకాల గణేష్‌తో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన కళింగ కోమటి సంఘ ప్రతినిధులు, పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

























# పిల్లలను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేయకండి..!



**తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడేటప్పుడు కొన్ని సందర్భాల్లో తమకు తెలియకుండానే ఒక రకమైన బెదిరింపు వాక్యాలు వాడతారు. కొందరు ఇందుకు మినహాయింపు కావచ్చు. పేరెంట్స్ పిల్లలలో వారి లక్ష్యాలను గుర్తుచేస్తూ బాగా చదవాలనే ఉద్దేశంతో కొన్ని అనకూడని మాటలు మాట్లాడుతారు.**

ముఖ్యంగా హాస్టల్లో ఉంటున్న పిల్లల దగ్గరకు పేరెంట్స్ వచ్చినపుడు కన్నీళ్లు పెడుతూ అనే మాటలు చిట్టి హృదయాలను పిండేయడమే అవుతుంది. 'లక్ష్యం పెట్టుకుని ప్రయత్నించు, వస్తే మంచిది, రాకపోతే అంతకంటే గొప్పది నీ కోసం ఎదురు చూస్తుందని' భరోసా ఇవ్వండి. 'నీ వెనుక ఒక కుటుంబం ఉంది, నీ జయాపజయాలలో మేమూ పాలుపంచుకుంటాం, ముందుకు వెళ్లు' అని చెప్పి చూడండి.

▸▸ 'మన స్థాయి కాకపోయినా నిన్ను ఈ స్కూల్లో చదివిస్తున్నాను. ఏం చేస్తావో ఏమో'.. ▸▸ 'ఆశలన్నీ నీ మీదే. మనకు ముందూ, వెనుక ఎవరూ లేరు'.. 'నాకు బతకాలనే లేదు, నీ గురించే బతకడం'.. ▸▸ 'డబ్బులు పోతే పోనీ, నువ్వు బాగా చదివితే చాలు'.. ▸▸ 'డబ్బులు కడుతున్నాం గదా, తిండి అయినా సరిగా తినలేవా'.. ▸▸ 'నువ్వు ఫెయిల్ అయితే మన పరువు గంగలో కలుస్తుంది'.. ▸▸ 'తమ్ముడు/అన్నయ్య/చెల్లెలు/అక్కయ్య గురించి బాధ లేదు, నువ్వు ఎలా గట్టెక్కుతావో ఏమో'.. ▸▸ ఇంకా వ్యవసాయం/వ్యాపారం బాగా లేదని, భూములు అమ్మేశామని, అప్పులు చేశామని పిల్లలతో తల్లిదండ్రులు మాట్లాడటం నేను గమనిస్తున్నాను. అవన్నీ వాస్తవాలే కావచ్చు. కానీ ఆ మాటలు పేరెంట్స్ ఆశించిన ప్రయోజనం చేకూర్చగలవా? ▸▸ మీ చదువుల గురించి మేము ఎన్నో ఇబ్బందులు పడుతున్నాము. కాబట్టి మీరు విధిగా మంచి మార్కులు తెచ్చుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలి, మరో గత్యంతరం లేదనే భావనను కలిగించడం విపరీత పరిణామాలకు దారితీయవచ్చు.

మరీ ముఖ్యంగా హాస్టల్లో ఉంటున్న పిల్లల దగ్గరకు పేరెంట్స్ వచ్చినపుడు కన్నీళ్లు పెడుతూ పై మాటలు అనడం చిట్టి హృదయాలను పిండేయడమే అవుతుంది. పిల్లల భవిష్యత్తుపై పేరెంట్స్ ఆందోళన చెందడం సహజం. అయితే పాత తరం కంటే కొత్త తరం ఎంతో కొంత మెరుగైన జీవితాన్ని గడపడం కూడా అంతే సహజం. తల్లిదండ్రులు పిల్లలకు జీవితం పట్ల ధైర్యాన్ని ఇవ్వాలి. 'లక్ష్యం పెట్టుకుని ప్రయత్నించు, వస్తే మంచిది, రాకపోతే అంతకంటే గొప్పది నీ కోసం ఎదురు చూస్తుందని' భరోసా ఇవ్వండి. 'నీ వెనుక ఒక కుటుంబం ఉంది, నీ జయాపజయాలలో మేమూ పాలుపంచుకుంటాం, ముందుకు వెళ్లు' అని చెప్పి చూడండి.

- సీహెచ్ దుర్గాప్రసాద్

# స్టార్ వాకర్స్ క్లబ్‌కు అంతర్జాతీయ స్థాయి అవార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో గడిచిన పదిహేనేళ్లుగా అనేక సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దినోత్సవాలు జరుపుతూ నడక, నడత ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తున్న స్టార్ వాకర్స్ క్లబ్‌కు వరుసగా అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ క్లబ్ అవార్డ్ వరించింది. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 క్యాబినెట్ అవార్డ్ ఫంక్షన్‌లో ఈ అవార్డ్స్ ప్రధానం చేశారు. ఉత్తమ క్లబ్‌గా స్టార్ వాకర్స్ క్లబ్, ఉత్తమ సేవాక్లబ్‌గా స్టార్ వనితా వాకర్స్ క్లబ్, ఉత్తమ క్లబ్ అధ్యక్షునిగా



బీవీ రవిశంకర్, ఉత్తమ డిప్యూటీ గవర్నర్‌గా శాసపు జోగినాయుడు, ఉత్తమ సామాజిక సేవకునిగా మాజీ గవర్నర్ జి.ఇందిరా ప్రసాద్, ఉత్తమ రీజనల్ కౌన్సిల్‌గా పీజీ గుప్తాలకు అవార్డ్స్ లభించాయి. అవార్డ్స్ అందుకున్న వారిలో మాజీ డిప్యూటీ గవర్నర్ సుగంధం సంజీవరావు, జి.లక్ష్మీ తదితరులు ఉన్నారు. సోమవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ కోఆర్డినేటర్ శాసపు జోగినాయుడు జి.ఇందిరా ప్రసాద్ సారధ్యంలో అవార్డ్ గ్రహీతలకు అభినందించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన అవార్డ్ ఫంక్షన్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ వి.మురళీమోహన్, కాబోయే చైర్మన్ ప్రభావతి, వాకర్స్ గవర్నర్ జామి నారాయణస్వామి, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు సుబ్బరాజు, ఎస్‌ఎస్‌ఎస్‌ఎస్ రాజు, కృష్ణంరాజు, గున్నేశ్వరరావు, అభిమన్యు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.


# అద్దెకొరకు

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

94403 72300, 98487 96626




వందేళ్ల చరిత్ర కలిగిన నీలమ్మతల్లి అమ్మవారిని పునఃప్రతిష్ఠించే కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, ఎమ్మెస్సార్ దంపతుల చేతుల మీదుగా నిర్వహించారు. గడిచిన శనివారం నుంచి సోమవారం వరకు శంకర్ సిద్ధాంతి ఆధ్వర్యంలో గణపతి పూజా మండప ఆవాహన, అమ్మవారి విగ్రహ పునర్దర్శన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అలాగే నీలమ్మతల్లికి చల్లదనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బారకల రాజారావు, ఉపాధ్యక్షులు గొడిగోటి బాలకృష్ణ, కార్యదర్శి గొండు నీలాద్రిరావు, ట్రెజరర్ రుప్ప అప్పారావు, కోల అప్పారావు, ఆలయ అనువంశిక ధర్మకర్తలు, స్థలదాతలు పీతల నీలాద్రిరావు, రంగారావు, ఈశ్వరరావు, పూజారులు తాళ్ల చక్రపాణితో పాటు లీల, లక్ష్మి, సుభద్ర, చిత్రకారుడు ఈశ్వరరావు, పిలక గోపి తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్



# 'లైఫ్' తీసేశావ్ కదా బాసూ..!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. ఆ తర్వాత దీన్ని మరుసటి ఏడాది కొనసాగించలేదు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి కలెక్టర్ లాఠకర్ ఈ సొమ్ములను ఎస్‌బీఐ నుంచి తీసేసి ఐసీఐసీఐ బ్యాంకులో వేశారు. దీని వల్ల తన కమీషన్ పోతుందని భావించిన టీఆర్‌ఎం రాజు స్వయంగా కలెక్టరేట్ ఉద్యోగులు లంచం తీసుకొని ఐసీఐసీఐకి అకౌంట్లు ట్రాన్స్‌ఫర్ చేసేశారంటూ ప్రచారం చేసుకొచ్చారు. ఒక్క కొవ్వాడ పరిహారం నుంచే రూ.3 కోట్ల ప్రీమియంలు ఎస్‌బీఐకి వెళ్లాయి. పరిహారాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడానికి వెళితే లక్షల్లో ఎస్‌బీఐ లైఫ్‌ను కట్టించారు. ఇప్పుడు రెన్యువల్ చేయలేక రైతులు లబోదిబోమంటున్నారు. తప్పు చేసైనా ఎస్‌బీఐ లైఫ్ కట్టించాలని టీఆర్‌ఎం రాజు ఆదేశించడంతో అప్పట్లో దీనిని ఉద్యోగుల సంఘ నాయకుడొకరు వ్యతిరేకించారు. దీంతో ఆయన్ను శ్రీకాకుళం నుంచి 900 కిలోమీటర్ల దూరం బదిలీ చేయించిన ఘనుడు రాజు. నగరానికి చెందిన ఒక కుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ తప్పుడు అప్రూవల్స్‌తో రామలక్ష్మణ బ్రాంచిలో లోన్స్ చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజు చివరకు ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్‌ను బెదిరించి పెద్ద ఎత్తున సొమ్ములు తన బినామీ పేరు మీద అపార్ట్‌మెంట్‌లో ఒక ప్లాట్‌ను తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. మొత్తానికి ఎస్‌బీఐ లైఫ్ పేరుతో బ్యాంకులైఫ్‌ను తీసేసిన బజారు బ్రాంచి కథ కొలిక్కి వచ్చినట్లయింది.

# చెకుముకిలో ఆదర్శ పాఠశాల ప్రతిభ



(సత్యంన్యూస్, లావేరు)

చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఈ నెల ఒకటో తేదీన నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో సుమారు 15 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో తామాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులైన ఆర్.హరిత, ఆర్.మోహిని, డి.ఎం.హర్షవర్ధన్‌లు విశేషమైన ప్రతిభను కనబరచి ప్రథమ శ్రేణిలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో చెకుముకి సంబరాలు 27న నిర్వహించగా, జిల్లాస్థాయిలో 75 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఈ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ద్వితీయ శ్రేణిలో నిలిచారు. ఈ విద్యార్థుల బృందాన్ని, సైన్స్ విభాగానికి చెందిన ఉపాధ్యాయులని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జి.డేనియల్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, సభ్యులు విద్యార్థుల్ని అభినందించారు. కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# దాడులపై వైకాపా ఆగ్రహం



(సత్యంన్యూస్, టెక్కలి)

దళిత కుటుంబంపై దాడి చేయడం అమానుష చర్యని శ్రీకాకుళం పార్లమెంట్ వైకాపా ఇన్‌ఛార్జి తమ్మినేని సీతారాం, టెక్కలి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ అన్నారు. ఆదివారం కోటబొమ్మాళి మండలం కిస్టుపురం గ్రామానికి చెందిన దళిత మహిళ సల్ల దమయంతి, ఆమె భర్త అప్పలరాజుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు దాడి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కోటబొమ్మాళి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దళిత కుటుంబం ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్యన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఉన్న మండలంలో దళితులపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఎస్పీ దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీలు రోణంకి మల్లయ్య, నడుపూరు శ్రీరామమూర్తి, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, వైకాపా నాయకులు హేమసుందరరాజు, దుక్క రామకృష్ణ, బోయిన నాగేశ్వరరావు, కాళ్ల సంజీవరావు, బొడ్డు వెంకటరమణ, పేరాడ వెంకట్రావులు పాల్గొన్నారు.

తిలక్‌ను అడ్డుకున్న పోలీసులు

పలాస పోలీస్ స్టేషన్లో టీడీపీ నాయకులు దాడికి గురైన వైకాపా నాయకులను పరామర్శించేందుకు నందిగాం నుంచి సోమవారం బయలుదేరిన వైకాపా టెక్కలి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పలాస వెలుతున్న తిలక్‌ను టెక్కలి సిఐ శ్రీనివాసరావు నందిగాం ఎస్ఐ అలీ సిబ్బందితో కలిసి అడ్డుకోవడం పట్ల తిలక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, కూటమి నాయకులు రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.

# శతజయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, పలాస)

సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ సీపీఐ కార్యాలయంలో సిహెచ్ రవి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పలాస మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శాఖ డిసెంబర్ 20 నుంచి 26 వరకు జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చాపర సుందర్‌లాల్, చాపర వేణుగోపాల్, ఎం.వెంకటరమణ, గోరు వాసు, సుందర్‌రావు మున్నా, పవన్, తిరుపతిరావు పాల్గొన్నారు.

# రైతుబజారులో చెత్త తొలగింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు, మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నా భారత్‌తో దీపావళి మేరా యువ భారత్ మొదటి వార్షికోత్సవ వేడుక సందర్భంగా హాస్పిటల్ వాలంటీరింగ్, మధ్యాహ్నం నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషులు శ్రీకాకుళం సంయుక్త ఆధ్వర్యంలో రైతుబజార్ మార్కెట్‌లోని చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం రూరల్ ఆర్‌డబ్ల్యూఎస్ సహాయ ఇంజనీర్ డి.హేమలత మాట్లాడుతూ ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి నూతన వెలుగులు తీసుకొచ్చే గొప్ప పండుగ దీపావళి అని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషులు ఎన్ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస పాత్రో మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర అకౌంట్స్ కార్యక్రమ సహాయకులు డి.శ్రీనివాసరావు, ఝాన్సీ, అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రౌతు సుమతి మోహనరావు, ఎస్.సత్యనారాయణ, ఎన్‌వైకే నేషనల్ యూత్ వాలంటీర్స్ అరుగుల దిలీప్ కుమార్, మట్ట ప్రియాంక, మౌనిక, రమేష్ యువత తదితరులు పాల్గొన్నారు.




# రక్త దాతలే ప్రాణదాతలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పోలీసు సిబ్బంది చేసిన రక్తదానం అత్యవసర పరిస్థితులు వేరే వ్యక్తి ప్రాణాలు కాపాడడానికి ఉపయోగపడుతుందని, రక్తదాతలే ప్రాణదాతలు అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్యశిబిరం, అదేవిధంగా రిమ్స్ గవర్నమెంట్ హాస్పిటల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీతో పాటు జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ క్రమంలో రక్తదానం చేసిన పోలీస్ సిబ్బందికి బ్లడ్ డొనేషన్ ధ్రువీకరణ పత్రాలతో పాటు, రెడ్‌క్రాస్ పతకాన్ని అందజేశారు. పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సిబ్బందికి మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యాధికారులను కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ 21 తేదీ నుంచి జరుగుతున్న అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది కొరకు మెగా ఉచిత వైద్య శిబిరం, ఇందులో భాగంగా రక్తదాన శిబిరాలను నిర్వహించడంచామని, ఇది చాల మంచి కార్యక్రమమన్నారు. రక్తదానం వలన అత్యవసర పరిస్థితులలో ఇంకొకరి ప్రాణాలు నిలబెట్టేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కావున పోలీస్ సిబ్బందితోపాటు యువత, విద్యార్థులు ప్రజలు ఇలాంటి కార్యక్రమంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈరోజు జిల్లా కేంద్రంగా ఎస్పీ కార్యాలయంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని, గవర్నమెంట్ హాస్పిటల్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎస్పీ సిహెచ్ వివేకానంద, ఎల్.శేషాద్రి, సీఐలు అవతారం, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, సూర్యనారాయణ, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రతినిధులు చైతన్య కుమార్, మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డా.సూర్యప్రకాష్, రంగనాథ్, శ్రీనివాస్, మురళీ కృష్ణ, రిమ్స్ హాస్పిటల్ వైద్య అధికారులు, సబ్ ఇన్స్పెక్టర్, ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్మాణాలు 373.. అనుమతులు కేవలం 12

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీ లేదు. అయినా సుడా అనుమతి లేదని 2021 డిసెంబర్ 14న అర్ధరాత్రి సమయంలో కట్టడాన్ని కూల్చేశారు. దీనిపై బాధితులు అధికారులను ప్రశ్నిస్తే దేవాలయ భూమిని ఆక్రమించి నిర్మాణం చేశారని మాటమార్చారు. ఆ తర్వాత దేవదాయ శాఖ భూమి కాదని తేలడంతో పంచాయతీ అధికారి సుడా అనుమతి లేనందున కూల్చేశామని నోటీసులు ఇచ్చారు. ఇప్పటికీ ఈ వ్యవహారంపై వివాదం నడుస్తుంది. వాస్తవంగా అనుమతి లేని భవనం కూల్చి వేయడానికి ముందు నోటీసులు ఇవ్వాలి. అలా కాకుండా రాజకీయ ఒత్తిడితో జిరాయితీ స్థలంలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చేశారు. అప్పటికే పొందూరు మండల కేంద్రంలో వైకాపా నాయకులకు చెందిన అక్రమ కట్టడాలు ఉన్నాయి. ఇప్పటికీ ఈ భవనాలకు సుడా అనుమతులు లేవు.

**అనధికారిక నిర్మాణాలు**

పొందూరు పంచాయతీ సర్పంచ్ నిర్మించిన ఇల్లు దేవదాయ శాఖకు చెందిన ప్రభుత్వం భూమిలోనే ఉంది. దీనికి సుడా అనుమతులు లేవు. అయినా రాజకీయ నాయకుల జోక్యంతో దాన్ని ఇప్పటికీ కాపాడుకుంటూ వస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న వైకాపా మండల నాయకుడు అనధికారికంగా నిర్మించినా పంచాయతీ అధికారులు ఇప్పటికీ నోటీసులు ఇవ్వలేదు. పొందూరు మండల కేంద్రంలో కేవలం మూడంతస్థుల భవన నిర్మాణాలకు మాత్రమే అనుమతి ఉంది. పొందూరులో నాలుగు ఫ్లోర్లు కలిగిన భవనాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న ఒక జ్యూయలరీ షాపు భవనానికి సుడా అనుమతి కేవలం మూడంతస్థులకు మాత్రమే ఇచ్చింది. అయితే అనధికారికంగా నాలుగో ఫ్లోర్ వేసి దర్జాగా వ్యాపారం చేసుకుంటున్నారు. రాంభజన వీధిలోనూ ఒక ఉపాధ్యాయుడు అనుమతులు లేకుండా భారీ బహుళ అంతస్థు భవనాన్ని నిర్మించినా అధికారులెవరూ తొంగిచూడలేదు. పంచాయతీ అన్ని మండల కేంద్రాల మాదిరిగానే కమర్షియల్‌గా అభివృద్ధి పథంలో నడుస్తుంది. మండల కేంద్రం పట్టణీకరణలో దూసుకుపోతుంది. దీంతో అక్రమంగా కమర్షియల్ భవనాలు వెలుస్తున్నాయి. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. అనుమతుల పేరుతో అధికారులు స్థానిక నాయకులతో కలిసి డబ్బులు తీసుకొని నిర్మాణాలకు అవకాశం ఇస్తున్నారు. సుడాకు రావాల్సిన ఆదాయాన్ని ఆయా పార్టీ నాయకులతో కలిసి పంచాయతీ అధికారులు పంచుకుంటూ ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారు.

**నాలుగేళ్లలో 373 కట్టడాలు**

సుడా పరిధిలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇప్పటి వరకు కేవలం 12 భవనాలకే సుడా అధికారులు అనుమతులు మంజూరు చేశారంటే ఏ స్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. సహ చట్టం ద్వారా అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు నాలుగేళ్లలో పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలో 373 వివిధ రకాల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో జగనన్న కాలనీకి సంబంధించిన ఇళ్లు ఉన్నాయి. వీటిని మినహాయిస్తే మిగతా నిర్మాణాలకు సుడా నుంచి ఎటువంటి అనుమతి తీసుకోలేదు. అయినప్పటికీ వీటికి విద్యుత్ మీటర్లు మంజూరు చేశారు. వీరంతా గత మూడేళ్లుగా బిల్లులు చెల్లిస్తున్నారు. అనధికారికం నిర్మించిన 182 షాపులు, హోటల్స్, హాస్పిటల్స్, స్కూల్స్ భవనాలకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు. మిగతా 191 రెసిడెన్షియల్ భవనాలు కాగా, కొన్ని బహుళ అంతస్థులు ఉన్నాయి. వీటికి సుడా అనుమతి లేకున్నా నిర్మాణాలు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. అధికారులు అనధికారిక నిర్మాణాలకు నోటీసులు జారీ చేసే ధైర్యం చేయడం లేదు. 373 నిర్మాణాల్లో కేవలం 10 నిర్మాణాలకు మాత్రమే నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఈ 10 భవనాలకు నోటీసులు జారీ చేసి నెలల గడుస్తున్నా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.